# విలువలు



జ్యోష

ఇద్దరూ ఆ మధ్యాహ్నపు ఎండలో నడిచి వచ్చి ఒక బట్టల దుకాణం ముందు ఆగిపోయారు.

కన్నయ్య ఇంతకుముందెప్పుడూ అలాంటి 'షాపు'లోకి నడిచి ఎరగడు. అతి చెప్పుడూ తనకి కావలసిన ధోవతులు తమ ఊళ్ళోనే ఉన్న నేతగాళ్ళదగ్గరే కొనేవాడు. ఇక అతని పెళ్ళాం చీరలమాటా? ఆమె ఇంతవరకూ పుట్టింటినించి వచ్చేటప్పుడు తెచ్చుకున్న వాటితోనే గడుపుతోంది.

కన్నయ్య చెప్పులు బయట విడిచి లోపలికి నడిచాడు, అది తన సొంతఇల్లు అనుకుంటున్నవాడిలా; కాని అదంతా చూసేవాళ్ళకి. పైకి అంతగంభీరంగా కనిపిస్తున్న కన్నయ్యకి మనస్సులో ఎంతో జంకుగా ఉంది. వాళ్ళు తనని మెడపట్టుకుని బయటకు నెట్టేసినా అతను ఆశ్చర్యపడేలా లేడు. తను ఏదో కొనడానికే వచ్చాడనీ, దారి తప్పికాదనీ వాళ్ళకి వెంటనే తెలియపర్చకపోతే అంత పనీ చేసేస్తారనుకుంటున్నట్లు "మా ఆడోళ్ళకి చీరలు కొనాలండి—" అని ఏదో తప్పు ఒప్పుకుంటున్నవాడిలా చెప్పేశాడు అక్కడున్న గుమాస్తాని చూస్తూ. అతనికి ఆక్షణంలో దుకాణంలోఉన్న ప్రతిమనిషి తన భావిని శాసించేవాడిలా కనపడ్డాడు. వాళ్ళతో తనరాకకి కారణంచెప్పేసి,వెనక్కి తిరిగి బుల్లెమ్మ నుద్దేశించి "లోపలికిరాయే. పర్లేదు" అని దుకాణం యజమాని మొహంలోకి చూశాడు. పైమీద గుడ్డతో మొహం తుడుచుకుంటూ భార్యరాకని పర్యవేక్షించాడు. అంతవరకు ఎండలో నిలుచున్న బుల్లెమ్మ సిగ్గుపడుతూ లోపలికి వచ్చింది.

"ఎలాంటి చీరలు కావాలీ?" గుమాస్తా మామూలుగానే అడిగాడు. కన్నయ్య ధరించిన రైతువేషం, రైతు మొహం, రైతు భయం చూసి అతను లోకువ కట్టలేదు. కాని కన్నయ్య మాత్రం వాళ్ళమెరిసే చొక్కాలనీ, ఇస్త్రీలో బిరుసెక్కిన పంట్లాలనీ చూస్తూ, వాటితో తన ముతకగుడ్డల్ని పోల్చుకుంటూ సిగ్గుపడ్డం మొదలెట్టాడు. బుద్ధిలేక పోయింది. తనకి తను ఈషాప్‌లోకి రాకుండా ఉండవల్సింది...ఓహో! షాప్ నిండా అద్దాల బీరువాలు, వాటిలో మెరిసే ఖరీదైన గుడ్డలు, షాప్‌లో పగలుకూడా వెలిగే ట్యూబ్ లైట్లు, ఎలక్ట్రిక్ పంకాలు... కన్నయ్య మళ్ళీ పైమీద గుడ్డతో మొహం తుడుచుకున్నాడు.

"చీరలండీ మామూలియి. ఒద్దే అక్కర్లేదండి. ఒకటిచాలు" అని బుల్లెమ్మ మొహంలోకి చూశాడు. బుల్లెమ్మ తల ఆడించింది.

గుమాస్తా చీరలు తెచ్చి నిరత్యంగా అక్కడున్న వెదురు పేలికల చాపమీద పరిచేస్తున్నాడు, చీరమీదున్న చీటీ చూడకుండానే దాని ఖరీదు చెప్పేస్తున్నాడు. వాటి ధరలు పదినుంచి పద్దెనిమిది రూపాయలు వరకూ ఉన్నాయి. బుల్లెమ్మ మనస్సు ఆవర్తానాన్ని చూడగానే కేరింతలు కొట్టింది. అక్కడే కుర్చీల మధ్య చోటు చేసుకుని కుదురుగా కూర్చొని చీరల్ని ఎంచడం మొదలు పెట్టింది.

బుల్లెమ్మ చిన్నపిల్లలా అమాయకంగా ఆ చీరల్ని వేళ్ళతో పట్టుకుని పరీక్షించడం కన్నయ్య సహించలేక పోతున్నాడు. వాళ్ళు "ఏయ్. వాటిని తాకకు పో" అంటారని అతని భయం. అతను చుట్టూ భయంగా చూశాడు. గుమాస్తా (బుల్లెమ్మకు ప్రత్యేకం) ఏ చీర ఎందుకు మంచిదో, వాడ్డం మొదలెట్టాక చీర అసలు రంగు ఎలా మారిపోతుందో శ్రగ్గరా చెప్పుకుపోతున్నాడు. యజమాని టెలిఫోన్‌లో ఇంగిష్ మాట్లాడేసున్నాడు.

"నా ఎసేస్ క్రైమ్సనజ్ ఛేంజింగ్" అని "నాకు తెలుసు.అందుచేతే ఐకజ్ ...డోంట్" కన్నయ్య దైవం మీద భారంవేసి చుట్టూ చూడడంలో పడిపోయాడు. అతను గుండె రాయి చేసుకున్నాడు. చాలా కాలం గడిచేక బుల్లెమ్మ ఒక చీర ఎంచుకుంది. అది ముదురు నీలిరంగు చీర, వెడల్పాటి అంచు ఖరీదు పదిహేను రూపాయల పధ్నాలుగణాలు. బేరం చేయడం మాత్రం చాలా హుషారుగా చేశాడు కన్నయ్య. చివరకి వాళ్ళని కిందపెట్టి, మీద పెట్టి పదిహేనున్నరకి ఒప్పించాడు. డబ్బు చెల్లించారు. గుమాస్తా అది చాలా 'నాణైమైన' సరుకనీ, చీరపోయినా రంగుపోదనీ హామీ ఇచ్చాక కాని వాళ్ళు బయటకు కదలేదు. పొద్దువాలింది. మధ్యాన్నం కూడుతిని ఓ గంట కూర్చుని బయల్దేరినవాళ్ళు తిరిగి పొయ్యిరాజేసే వేళకి ఇల్లు చేరుకున్నారు. అది కన్నయ్య, అతని తండ్రీ కలిసి ఒక్క ఇటిక వాడకుండా కట్టిన తాటాకుల ఇల్లు.

* * *

"పదిహేను రూపాయలే!"

"నువ్వు మరీని. పదిహేనున్నరట."

"నా మతి మండా, ఇంకా పదిహేను అనుకుంటున్నా."

బుల్లెమ్మ చీరగురించి తెలిసిన గూడెంలో ఆడవాళ్ళు అలాగా, ఇంకా అనేక విధాలుగానూ మాట్లాడుకున్నారు. వాళ్ళలో చీరకోసం ఐదు రూపాయలు ఖర్చుపెట్టలేదు. ఒకసారి. బుల్లెమ్మ మొగుడు 'రంగం' నించి వస్తూ ఏడు రూపాయలు చీర తెచ్చినప్పుడు అందరూ వెళ్ళి ఆ చీరని చూసి, తాకి, ఎన్నికచేసివచ్చారు. ఇప్పుడు బుల్లెమ్మ కొనుక్కున్నచీర వాళ్ళ అనుభవాన్నే

కాదు, ఊహానికూడా మించిపోయింది. అది తెలుగు పౌరాణిక చిత్రంలో 'రాక్ అండ్ రోల్' పాటలా చాలా విపరీతంగా తోచింది.

అయితే ఇందులో బుల్లెమ్మ తప్పేం లేదు. బుల్లెమ్మ ఖరీదైన చీరలమీది మోజును అవ్యక్తంలోనే దాచేసుకుంది. తను ఇంట్లో పొదుపుగానూ, తెలివిగానూ పనిచేసి లాభంచేసినా అందుకు సొంతలాభం కావాలనుకోలేదు. కాని నిన్న రాత్రి కన్నయ్యే మొదలెట్టాడు. అతను ఈనాందార్లకి ఇవ్వాల్సింది ఇచ్చెయ్యగా, ఖర్చులు గట్రా తీసేశాకకూడా బోలెడంత లాభం కనపడింది పొలంమీద. అదంతా బుల్లెమ్మ అదృష్టమని అతనికి తోచింది. రాత్రి కూడు తింటూ మొదలెట్టాడు. "నీకేం బహుమతి కావాలో కోరుకోవే" అన్నాడు, ఇక మోటారుకారు కావాలన్నా ఇచ్చేసేవాడిలా. పైకి అలా అన్నా అతనికి భయంగా నేఉంది బుల్లెమ్మ తన తాహతుకి మించిన వస్తువు, ఏ బంగారువగో అడుగుతుందనీ తను చిన్నపుచ్చవలిసొస్తుందనీని. కాని బుల్లెమ్మ అతని భయం, అతని దగరున్న డబ్బు అన్నీ తెలిసినదానిలా ఒక 'అలాంటి చీర' కావాలంది. కన్నయ్య మురిసిపోయాడు. బుల్లెమ్మ తెలిసి బాధించదు; అంతేకాదు తెలియకకూడా బాధించదు. అంచేత బుల్లెమ్మవద్దన్నా ఇంత ఖరీదుపెట్టి ఈ చీర కొనేశాడు.

* * * *

బుల్లెమ్మలో చాలా ముఖ్యమైన లక్షణం శాంతం. ఆమె మనస్సులో ఎంత ఉద్ధృతమైన భావాలొచ్చినా ఆమె కదలికలో ఏమీ కనపడవు. పంధొమ్మిదేళ్ల బుల్లెమ్మ అలా ఉండడం లోటో, గొప్పకో తెలుసుకోడం కష్టం. ఎప్పటిలాగే బుల్లెమ్మ ఆచీరను చూసి నిశ్శబ్దంగా ఆనందించింది. ఇంటికొచ్చాక ఒకటి రెండు



# ★ విలువలు ★

సారి ఆ మడతల్లో ముఖాన్ని దాచుకుంది. ఆ చీరది. ఒక రకం బిస్కట్ల వాసన. కొంతసేపు చూసి జాగ్రత్తగా తనపెద్ద కొయ్యపెట్టెలో దాచేసింది.

సాయంత్రం ఇంకా పొద్దుగూకకుండానే అన్నం తినేసి వీధిలోకి వెళ్ళిపోయాడు కన్నయ్య. బాగా చీకటిపడి అందరి ఇళ్ళల్లోనూ పిల్లలు నిద్రకు తయారయ్యాకకూడా కన్నయ్య రాలేదు. బుల్లెమ్మ ఆరుబయట నులకమంచం వాల్చుకుని పడుకొని ఆలోచన మొదలు పెట్టింది. కొంతసేపు ఆ చీర రంగు, వాసన ఎలా ఉంటాయో ఊహించుకుంది.

ఆకాశంలో తూర్పునుంచి ఒక చిక్కటి మబ్బు కమ్ముకొస్తోంది. మబ్బులేనిచోట నక్షత్రాలు ఎప్పుడూలేని కాంతితో మెరుస్తున్నాయి. గాలి అప్పుడప్పుడు వచ్చిపోతోంది. చూరుకి ఇవతలగా, దానిమ్మచెట్టు పక్కనున్న మంచంమీద వెల్లకితలా పడుకుని బుల్లెమ్మ నిశ్శబ్దంగా ఆలోచించుకుంటోంది.

ఆ చీరె గురించి...ఒకవైపు తృప్తి... మరోవైపు ఏదో తెలీని దిగులు. బుల్లెమ్మలో చాలా కలగాపులగపు భావాలు చేరి అల్లరి మొదలెట్టాయి.

తనా చీరెను ఎప్పుడు ఎలా కట్టుకుంటుందో బుల్లెమ్మకు పాలుపోలేదు. తను రోజంతా చీమలా శ్రమించే మనిషి. ఆ చీర కట్టుకుని తనేం పని చేస్తుంది? ఆ చీరె కట్టుకుని మడత నలగకుండా, పమిట చెదరకుండా ఒక ఎత్తైన కుర్చీలో నేలని తాకకుండా కూర్చోవాలి తను! తనకు ఆ చీర కట్టుకుని బొమ్మలా కూర్చోవడం చేతకాదు.

క్రమంగా బుల్లెమ్మకు ఆ చీరంటే ఉత్సాహం పోయింది. అంత పల్చటిచీరా ఆమెకో బరువులా తోచింది. బుల్లెమ్మ తనుండే గుడిసెల్లూ, 'తను' అనబడే తన ఒళ్ళూ ఆ చీరెను మురికిచేసేస్తాయనుకుంది. బుల్లెమ్మ ఒళ్ళు శుభ్రంగా ఉండదని కాదు. శుభ్రంగానే ఉంటుంది. కాని బుల్లెమ్మకు ఆ ఊహ రాలేదు. ఆ చీరకు తను తగననుకుంది. అది ఆలోచన ఫలితం కాదు; అదో నమ్మకం; దానికి ఎదురెళ్ళడం బుల్లెమ్మకు చేతకాదు.

బుల్లెమ్మ ఆ చీర మర్నాడు కట్టుకోలేదు. ఆ మర్నాడూ కట్టుకోలేదు. మరో నెల్లాళ్ళు గడిచినా కట్టుకోలేదు. ఎప్పుడూ కట్టుకోలేదు.

పెద్దపండుగ రోజున కన్నయ్య పట్టుపట్టాడు ఆ చీరె కట్టుకోవాలని. బుల్లెమ్మ కూడా ఆతనిమాటల ఆసరాతో అందుకు సిద్ధపడింది కాని మళ్ళీ మనసు మార్చుకుని ఆ చీర పెట్టెలో పెట్టి ఏదో పని కల్పించుకుంది.

బుల్లెమ్మ ఆ చీర కట్టకోకుండా సంవత్సరాలు దొర్లిపోయాయి. కన్నయ్య ప్రతీ ఏటా పొలంమీద లాభం తీశాడు. పదేళ్ళు గడిచేసరికి కన్నయ్య భూమికొన్నాడు తనకి భూమి కౌలుకిచ్చిన వాళ్ళ దగ్గర్నుంచి. బుల్లెమ్మ కొత్తలో ఆ చీర తరుచుగా పెట్లోంచి తీసి దాన్ని పసిపాపలా ముద్దు చేస్తుండేది. పురుగు చేరకుండా కలరా ఉండలు ఉంచేది దాని మడతల్లో. ఒక్కొక్కసారి ఎండలో ఉంచి మళ్ళీ జాగ్రత్తగా మడతపెట్టి దాచేసేది.

ఆ చీరనుచూస్తే, తాకితే బుల్లెమ్మకు ఒళ్ళు పులకించేది. ఏదో దిగులూ కలిగేది. కావ్యాల్లో విషాదంలాగా అదో తియని బాధ. ఆ చీర కట్టుకోవాలనీ కోరిక కలిగితే, 'ఆ రోజు వస్తుంది. అప్పుడు...' అని మనస్సును మరిపించేది. అదేదో అద్భుతమైన రోజు అని బుల్లెమ్మ నమ్మకం. అది ఎలా వస్తుందో మాత్రం ఊహాకూడా లేదు.

'ఆ రోజూ' వచ్చింది. కన్నయ్య పెద్ద 'ఖామందు' అయిపోయాడు. పెద్ద కామందుకి చాలా పెద్ద సంబంధం బుల్లెమ్మకు తెలుసు తను తన చీర ఇప్పుడు హాయిగా కట్టుకోవచ్చుని.

ఇంటిలోపలా, ఇంటి వెలుపలా పెళ్ళి సందడి. బుల్లెమ్మ కాస్త తీరిక చేసుకొని గదిలోకివచ్చి తలుపు గడియ వేసింది. గుండెలు కొట్టుకుంటుండగా తన కొయ్యపెట్టె మూత తెరిచి చీర బయటకు తీసింది. మళ్ళీ బుల్లెమ్మ ఒళ్ళు ఆ చీరని మొదటిసారి తాకినట్లయి పులకించింది. బుల్లెమ్మ ఆత్రుతతో మడతలు విప్పింది. ఇన్నేళ్ళు ఎదురు చూసిన రోజు హఠాత్తుగా గోదావరి వరదలా వచ్చింది మరి.

ఎప్పుడూ కట్టకపోవడంచేత ఆ చీర కొత్తదిగా ఉండిపోయింది. అది కొత్త చీర!

పొందని అందంలో విలువ ఏమంటే అది పాతపడదు. ఆ అపురూపమైన ఆనందాన్నే తనచీరని చూసుకుంటూ, "ఇప్పుడు కాదు రేపు..." అని వాయిదాలువేస్తూ గడిపి బుల్లెమ్మ అనుభవించింది. ఆచీరను కొనగానే ధరించి ఉంటే దానిమీది మోజు ఒక ఏడాదిలో పోయి ఉండేది; అది మరో రెండేళ్ళలో పాతపడి ఉండేది. కాని...

బుల్లెమ్మలా అలా చీరెను పూజిస్తూ గడిపినవాళ్ళు ఇప్పుడెవరూ కనిపించక పోవచ్చు. అలా ఇంకెవరూ లేకపోవడం బుల్లెమ్మ అనుభవానికి మరీ విలువ ఇస్తుంది

కాని బుల్లెమ్మ అంతకంటే అదృష్టవంతురాలే. ఆచీర ఇప్పుడు కట్టేసుకుని దానిమీదుండే పదిహేనేళ్ళ మోజూ పోయి ఆ వెలితిని భరించేయోగం ఆమెకు లేదు. ఎందుకంటే ఆచీర ఇప్పుడు చీరలా లేదు. జల్లెడలా ఉంది. పురుగులు చక్కగా ఏవో డిజైన్లు వేసుకుని దాన్ని తినివేశాయి. ఆచీరని చీకట్లో ఒకదీపం వెనక ఉంచి చూస్తే చుక్కలతో నిండిన ఆకాశంలా ఉంటుంది.

బుల్లెమ్మ ఆచీరెను గభాలున గుండెకు హత్తుకుని అక్కడ కూర్చుండి పోయింది ఆమెకు పెద్దబరువు శాశ్వతంగా తీరిపోయినట్లైంది. ఆమెకు తెలీకుండా కళ్లు చెక్కిళ్లు తడిసిపోయాయి. ★

మెక్లీన్స్ రంగులువేసే పోటీ

ఇప్పుడే పాల్గొనండి!

వందల కొలదీ బహుమతులు గెలువబడవలెను!